



# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఆగస్ట్ 25, 2026 | సంపుటి : 2 | సంచిక : 314 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# తెలంగాణపై ఏంటీ వివక్ష?

## గుజరాత్ సీఎంకు అనుమతి.. నన్ను అడ్డుకుంటారా?

- అమెరికా పర్యటనను ఎందుకు అడ్డుకున్నారు?
- రాజకీయ కారణం ఏంటో కేంద్రం చెప్పాలి
- తెలంగాణకు వచ్చే పెట్టుబడులను అడ్డుకుంటున్నారు
- నన్ను అడ్డుకున్నా.. లక్ష్యాన్ని అడ్డుకోలేరు



**హైదరాబాద్:**
వికసిత్ భారత్ లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 పేరిట పెట్టుబడుల ఆకర్షణకు తలపెట్టిన తన అమెరికా పర్యటనను కేంద్రం అడ్డుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు.

**◆ భాజపా నేతలు నా పర్యటనపై తప్పుదోవ పట్టించారు!**

లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భాజపా నేతల తీరును ప్రశ్నించారు. "రాష్ట్రాలకు కేంద్రం సహకరించకపోవడం మన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యలో సహకారం, పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా పర్యటన తలపెట్టాను. బ్రిటన్‌కు అనుమతించి.. అమెరికా పర్యటనను కేంద్రం నిరాకరించింది. పెట్టుబడులు సాధన కోసం గతంలోనూ విదేశాలకు వెళ్లాం. కానీ ఈసారి లండన్‌కు అనుమతించి అమెరికా వెళ్లకుండా చేశారు. కేంద్రం వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ శ్రేణులతో పాటు విద్య, క్రీడల విధానాలు, పెట్టుబడుల విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా యువతకు మేలు జరుగుతుందని నమ్మే వారంతా తప్పుబట్టారు. విదేశాంగ శాఖ నా పర్యటనను తిరస్కరించడంతో పాటు భాజపా నేతలు కొందరు నా పర్యటన వివరాలపై తప్పుదారి పట్టించేలా, వ్యక్తిగత ఆరోపణలు చేశారు. నా అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పి తప్పుదోవ పట్టించారు.

**◆ 'రాజకీయ కారణం' అంటే ఏమిటి?**

నా విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యత లేదు. ఈ పర్యటనకు దరఖాస్తు చేసినప్పుడు అన్ని విషయాలూ స్పష్టంగా పేర్కొన్నాం. విద్య, క్రీడలు, రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికాలో ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని చెప్పాం. యూకే, యూఎస్ పర్యటనకు ఒకే తరహా వివరాలు ఇచ్చాం. నా పర్యటన మొత్తం షెడ్యూల్‌ను విదేశాంగ శాఖ ముందు ఉంచాం. కానీ, రాజకీయ కారణాల వల్ల అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణంతో అనుమతి ఇవ్వడంలేదని విదేశాంగ శాఖ బదులిచ్చింది.

మిగతాద్ది 2 లో

# కొండా సురేఖ వ్యవహారం..
## సీఎం రేవంత్ ఏమన్నారంటే..



**హైదరాబాద్:**
కాంగ్రెస్ పార్టీ నియమాలకు నేతలంతా కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖ కు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసుల అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా సీఎం స్పందించారు. "పార్టీలోని నేతల క్రమశిక్షణ వ్యవహారాల గురించి నేను చర్చించను. ఆ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది. అన్నీ పరిశీలించి కమిటీ చర్యలు తీసుకుంటుంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ జన్మదినం సందర్భంగా ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై సుస్మిత తీవ్ర విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రికి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖను కోరింది. దీనిపై మంత్రి వివరణ ఇస్తూ సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని కోరారు.



## విదేశాల్లో తలదాచుకున్న గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం - అమిత్ షా

దేశంలో కుట్రలకు పాల్పడి విదేశాల్లో తలదాచుకున్న నిందితులపై భారత్ ఉక్కుపాదం మోపుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దేశం విడిచి పారిపోయిన ముగ్గురు గ్యాంగ్‌స్టర్లను మలేషియాలో పట్టుకున్న దర్యాప్తు ఏజన్సీలు భారత్‌కు తీసుకొచ్చిన నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

2 లో





## సెప్టెంబరు 7 నుంచి తెలంగాణ
# అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్:**
తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సెప్టెంబరు 7 నుంచి ప్రారంభం కానున్నాయి. శాసనసభ, శాసనమండలిని ఎన్ని రోజులు నిర్వహించాలనే విషయంపై తొలి రోజు సమావేశం తర్వాత జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) భేటీలో నిర్ణయిస్తారు. ఈ వర్షాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది.

## తెలంగాణ మందు బాబులకు గుడ్‌న్యూస్..

**హైదరాబాద్:**
తెలంగాణలో మద్యం ప్రియులకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో త్వరలో కొత్తగా 121 రకాల లిక్కర్ బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో అంతర్జాతీయంగా పేరున్న బ్రాండ్లను కూడా ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

## ప్రభుత్వ పథకాలపై
# హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- » కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యేలు ఇవ్వడమేంటి?
- » చెక్కుల పంపిణీ అధికారులు చేయాలి.. రాజకీయ జోక్యం వద్దు
- » పథకాల అమలులో అధికారుల పాత్రపై హైకోర్టు ప్రశ్నలు
- » ఎమ్మెల్యేల ద్వారా చెక్కుల పంపిణీ రాజకీయ జోక్యమే అని వ్యాఖ్య
- » దివ్యాంగుల ఆర్థికసాయం కొనసాగింపునకు హైకోర్టు అనుమతి
- » జీవో నం.4పై స్టే ఎత్తివేసిన హైకోర్టు
- » ఉచిత పథకాలపై గతంలోనూ హైకోర్టు కీలక వ్యాఖ్యలు
- » అవసరం ఉన్నవారికే ప్రభుత్వ సాయం అందాలన్న కోర్టు



2లో..

**హైదరాబాద్:**
ప్రభుత్వ పథకాలపై తెలంగాణ హైకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబాకర్ పథకాలపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు.. వాటికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యేలు ఇవ్వడమేంటని ప్రశ్నించింది. దీనికి సంబంధించిన చెక్కులను అధికారులు ఇవ్వకుండా ఎమ్మెల్యేలు ఇవ్వడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు ఈ చెక్కుల పంపిణీ అంశంలో సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది.

## త్వరలోనే తెలంగాణ ప్రభుత్వ సొంత 'రైడ్-హెయిలింగ్' యాప్!

తెలంగాణలో ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘాలు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలం కావడంతో డ్రైవర్లు సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం, ఆదాయ మార్గాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం కొన్ని సంచలనాత్మక నిర్ణయాలను వెల్లడించింది.

**◆ సొంత యాప్ రూపకల్పన**

ఓలా, ఊబర్ వంటి ప్రైవేట్ అగ్రిగేటర్ సంస్థలకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వమే ప్రత్యేకంగా ఒక 'రైడ్-హెయిలింగ్ యాప్'ను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు.






## 22ఏ బాధితులకు న్యాయం చేస్తాం: పొంగులేటి

- బాధితులు ఎవరూ భయపడొద్దు
- ప్లాట్ల బుకింగ్ డబ్బులు వాపస్
- స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్లు
- ఫాస్ట్‌ట్రాక్‌లో రిజిస్ట్రేషన్లు
- 22ఏ సమస్యపై ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు

2 లో



మిగతాది 2లో

## రామచందర్‌రావుకు పొన్నం ప్రభాకర్ కౌంటర్

- చేతనైతే కేంద్రం నుంచి నిధులు సాధించండి
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మొసలి కన్నీరు వద్దు
- పాత బకాయిలను విడతల వారీగా చెల్లిస్తున్నాం
- ఈ ఏడాది నుంచి అడ్వాన్స్ పేమెంట్‌కు చర్యలు
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉందా?



## ఖర్గేతో కొండా
# సురేఖ భేటీ

- కుమార్తె సుస్మిత వ్యాఖ్యలపై వివరణ
- గంటకుపైగా కొనసాగిన భేటీ
- పార్టీకి నష్టం కలిగేలా మాట్లాడొద్దు: ఖర్గే
- పార్టీ విషయాలు పార్టీ వేదికపైనే చెప్పాలి
- వ్యాఖ్యలపై ఇప్పటికే రెండుసార్లు



2లో

## రేవంత్ సర్కార్‌పై రాంచందర్‌రావు ఫైర్

» ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి » విద్యార్థులను ప్రభుత్వం అణచివేస్తోంది » ఓయూకు రూ.1,000 కోట్ల హామీ ఏమైంది? » రాహుల్ గాంధీకి రాంచందర్‌రావు సవాల్ » కాంగ్రెస్ సర్కార్‌ను గద్దె దించాలి

**హైదరాబాద్:**
తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశం మరోసారి రాజకీయ వేడిని రాజేసింది. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే నడుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా ఆరోపించారు. విద్యార్థులు, కాలేజీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంబిస్తోందని మండిపడ్డారు.

# విద్యాశాఖ మంత్రులకు అభిజీత్ దీప్కే లేఖ

- ప్రాథమిక విద్య రాజకీయ సమస్య కాదు
- ప్రతి బిడ్డకు ప్రాథమిక విద్య హక్కు
- ప్రభుత్వ పాఠశాలలను అత్యవసరంగా పునరుద్ధరించాలి
- మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయ ఖాళీలపై వివరాలు ఇవ్వాలి



2 లో

దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే బహిరంగ లేఖ రాశారు. అందులో ప్రాథమిక విద్య అనేది రాజకీయ సమస్య కాదని.. ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల లేమిని ఎత్తిచూపారు. వాటిని మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఆగస్ట్ 25, 2026

# 22ఏ బాధితులకు న్యాయం చేస్తాం: పొంగులేటి

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం హైదరాబాద్ కోర్‌లో 22ఏ అంశం ఎంతో జఠిలంగా మారిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. 22ఏ బాధితులకు ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో న్యాయం చేసి తీరుతుందన్నారు. హైదరాబాద్‌లో ఈ రోజు (సోమవారం) ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అబద్ధాలతో ప్రతిపక్షం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని.. ఈ అంశంలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మంత్రి తేల్చిచెప్పారు.

మంత్రి మాట్లాడుతూ.. ప్లాట్ల బుకింగ్ కోసం డబ్బులు చెల్లించిన వారికి నగదు వెనక్కి ఇస్తాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు పనిచేయడం లేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది. ఇప్పటివరకూ ఆ నంబర్‌కు వేలాదిగా కాల్స్ వచ్చాయి. క్యూర్ ప్రాంతంలోని రైతుల సమస్యలను చర్చించాం. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్లు చేస్తాం. ఫాస్ట్ ట్రాక్‌లో రిజిస్ట్రేషన్లు చేస్తాం. అని మంత్రి అన్నారు.

## ◆ సెక్షన్ 22ఏ సమస్య ఏంటి?

రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అయితే ఇటీవల ప్రభుత్వం తీసుకవచ్చిన 'భూ భారతి'లో 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రత అధికంగా ఉంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాలతో పాటు, దశాబ్దాల క్రితం హుడా, హెచ్ఎండీఏ అనుమతులతో ఏర్పడిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు కూడా ఈ జాబితాలో చేరాయి. రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడే తమ ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని యజమానులకు తెలియడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

# రేవంత్ సర్కార్‌పై రాంచందర్‌రావు ఫైర్

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1,000 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాలేజీ యాజమాన్యాలను ప్రభుత్వం ఒత్తిడికి గురిచేస్తోందని ఆరోపించారు. ఫీజు బకాయిలపై హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తర్వాత కొంత మొత్తాన్ని విడుదల చేస్తామని చెప్పినా.. ఆ హామీ కూడా అమలు కాలేదని ఆయన అన్నారు. బకాయిల కోసం విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు ఆందోళన చేస్తుంటే వాటిని అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

### రాహుల్ గాంధీకి సవాల్

ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కూడా రాంచందర్‌రావు టార్గెట్ చేశారు. "రాహుల్ గాంధీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడాలి" అంటూ సవాల్ విసిరారు. దేశంలో యువతను రెచ్చగొట్టి ప్రధాని మోదీని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ నుంచి రాహుల్ గాంధీకి ప్రయోజనాలు అందుతున్నాయంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఆయన.. విద్యార్థులకు మాత్రం ఫీజు బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు.

### కాంగ్రెస్‌ను గద్దె దించాలి

దేశ వ్యతిరేక శక్తులతో సీఎం రేవంత్‌రెడ్డి చేతులు కలుపుతున్నారని రాంచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా తమ ప్రయోజనాల కోసం పరస్పరం పోటీ పడుతున్నారని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల శక్తి ఏంటో కాంగ్రెస్ ప్రభుత్వానికి చూపించాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు.

# విద్యాశాఖ మంత్రులకు అభిజీత్ దీప్కే లేఖ

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణను అత్యవసర ప్రాధాన్యతగా పరిగణించాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సీజేపీ 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన పలు డిమాండ్లు లేవనెత్తారు. అవేంటంటే..?

- » మౌలిక సదుపాయాలు: గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధరించారనే డేటా.. ప్రస్తుతం తక్షణ మరమ్మతులు లేదా పూర్తిస్థాయి పునరుద్ధరణలు అవసరమైన పాఠశాలల మొత్తం సంఖ్యను విద్యాశాఖ మంత్రులు వెల్లడించాలి.
- » ప్రాథమిక సౌకర్యాలు: మరుగుదొడ్లు, శుభ్రమైన తాగునీరు, డిజిటల్/కంప్యూటర్ లెర్నింగ్ సౌకర్యాలు, ప్లే గ్రౌండ్, సరైన క్రీడా పరికరాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల సంఖ్య
- » ఉపాధ్యాయ ఖాళీలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లోని మొత్తం బోధనా పోస్టుల సంఖ్య, ప్రస్తుతం భర్తీ చేసిన పోస్టులు, ఖాళీల వివరాలు.
- » ఆర్థిక జవాబుదారీతనం: గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన నిధులు, క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఖర్చు చేసిన వ్యయంతో వాటిని పోల్చి చూపే వివరాలు.
- » నాణ్యమైన విద్య: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి వీలుగా ఏర్పాటు చేయాల్సిన అదనపు పాఠశాలల సంఖ్య వివరాలు.
- » బోధనేతర విధులు: పాఠశాలల్లో బోధన కాకుండా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు కేటాయించే ఇతర విధులకు సంబంధించిన వివరాలు
- » స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలైనా దేశంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఇప్పటికీ సరైన మరుగుదొడ్లు, సురక్షితమైన తాగునీరు, సరైన తరగతి గదులు, బెంచీలు వంటి సౌకర్యాలు లేవని దీప్కే పేర్కొన్నారు. వారిని జంతువుల కంటే హీనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# తెలంగాణపై ఏంటీ వివక్ష?

మొదటిపేజీ తరువాయి

రాజకీయ కారణం అంటే ఏమిటీ? బ్రిటన్ పర్యటనకు ఓకే చెప్పి.. అమెరికా పర్యటనను మాత్రం ఎందుకు అడ్డుకున్నారు. నేను తెలంగాణ సీఎంను.. కాంగ్రెస్ సీఎంను కావడమే కారణమా? ఒక సీఎం విదేశాలకు వెళ్తే విదేశీ రాయబారులు వెంటే ఉంటారు. ప్రతి కార్యక్రమాన్నీ వారు పర్యవేక్షిస్తారు.

### ◆ నన్ను అడ్డుకున్నా.. లక్ష్యాన్ని అడ్డుకోలేరు

కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా.

### ◆ మోదీ పాక్ వెళ్లొచ్చు.. మేం అమెరికా వెళ్లకూడదా?

నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉంది.

### ◆ తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని ఖండించాలి

తెలంగాణ సీఎంకు అనుమతి నిరాకరించడం అంటే ఒక వ్యక్తిగా రేవంత్ రెడ్డికి ఎదురైన నిరాకరణ కాదు.. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం.. తిరస్కరణ. ఈ తిరస్కరణకు కారణం గుజరాత్ ఆధిపత్యం. రాజకీయ కారణాలు చూపించి అనుమతి నిరాకరించడాన్ని తెలంగాణ సమాజం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరముంది. తెలంగాణ సీఎంను అమెరికా వెళ్లకుండా అడ్డుకోవడమంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. రాష్ట్రం పట్ల కేంద్రం స్పష్టమైన వివక్షను చూపిస్తోంది. ఇది ఏమాత్రం సహించరానిది. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి" అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# నాపై నిఘా పెట్టారు.. ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు

నిజామాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు తన కదలికలపై నిఘా ఉంచేందుకు.. తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన ఓ ఏసీపీ స్థాయి అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్' వేదికగా సోమవారం ఆరోపణలు చేశారు. డీజీపీ సీవీ ఆనంద్ సమర్థమైన అధికారి అని పేర్కొంటూనే.. పోలీసు వ్యవస్థ పనితీరుపై ఎంపీ పలు ప్రశ్నలు సంధించారు. 'తెలంగాణ పోలీస్ శాఖ రాజ్యాంగం, చట్టబద్ధమైన ఆదేశాల ప్రకారం పనిచేస్తోందా? లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు నడుచుకుంటోందా?' అని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థ రాజకీయ కుటుంబాలకు కాకుండా చట్టానికి జవాబుదారీగా ఉండాలని అర్వింద్ పేర్కొన్నారు.

# కేపీహెచ్‌బీలో విషాదం.. ఐదో అంతస్తు నుంచి దూకి మహిళ ఆత్మహత్య

హైదరాబాద్ (కేపీహెచ్‌బీ కాలనీ): హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో విషాదం చోటుచేసుకుంది. డిప్రెషన్‌తో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కేపీహెచ్‌బీ ఎస్సై శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కానూర్‌కు చెందిన సోను పురుషోత్తమన్, శీతల్ భార్యాభర్తలు. ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల చిన్నారి ఉంది. పురుషోత్తమన్ ఎస్‌బీఐలో డీఎంగా పనిచేస్తున్నారు. భార్య, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో ఉంటున్నారు.



సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో శీతల్ (32) టెర్రస్ ఎక్కే మెట్లపై 10 నిమిషాలు పాటు కూర్చుంది. తర్వాత టెర్రస్ పైకి ఎక్కి అపార్ట్‌మెంట్ గేటు ఆవరణలోకి దూకేసింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ బలవన్మరణానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఆమె భర్తతో పాటు కేరళలో ఉన్న సోదరుడితోనూ మాట్లాడారు. శీతల్ కొంత కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతోందని.. దీనికి మందులు వినియోగిస్తున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. కేరళలో ఉన్న శీతల్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

# తెలంగాణ మందు బాబులకు గుడ్‌న్యూస్..

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (TSBCL).. 18 ప్రముఖ సరఫరా సంస్థలకు చెందిన 121 కొత్త లిక్కర్ బ్రాండ్లను రాష్ట్రంలో ప్రవేశపెట్టే ప్రక్రియను చేపట్టింది. ఆయా బ్రాండ్లకు అనుమతులు ఇచ్చే ముందు ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.

## సెప్టెంబర్ 1లోగా అభ్యంతరాలు..

కొత్త లిక్కర్ బ్రాండ్ల ప్రవేశంపై ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేయాలనుకుంటే సెప్టెంబర్ 1వ తేదీలోపు తెలియజేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది. అందిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తదుపరి అనుమతుల ప్రక్రియ కొనసాగనుంది. కొత్త బ్రాండ్లకు అనుమతులు లభిస్తే.. రాష్ట్రంలోని మద్యం దుకాణాలు, బార్లలో వినియోగదారులకు మరిన్ని బ్రాండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అంతర్జాతీయ బ్రాండ్లతో పాటు 121 కొత్త రకాల లిక్కర్ రాష్ట్రంలోకి రానుండటంతో మద్యం ప్రియుల్లో ఆసక్తి నెలకొంది.

# ప్రభుత్వ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

అదే సమయంలో దివ్యాంగులకు ఇచ్చే ఆర్థికసాయం కొనసాగించేందుకు అనుమతించిన తెలంగాణ హైకోర్టు.. జీవో నంబర్ 4పై ఉన్న స్టేను ఎత్తివేసింది. కాగా, ఈ నెల ఆరంభంలో ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే. ఆగస్టు 7వ తేదీన ఒక కేసు విచారణ సందర్భంగా.. కోటీశ్వరులు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారని వ్యాఖ్యానించింది. రైతుల కోసం అమలు చేసిన రైతుబంధు వంటి పథకాలలోనూ సంపన్నులు లబ్ధి పొందిన విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. నిజంగా అవసరం ఉన్నవారికి ప్రభుత్వ సాయం అందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

ఇక ఆగస్టు 20వ తేదీన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబాకర్ పథకాలపై హైకోర్టు విచారణ సందర్భంగా నిధుల విడుదల అంశానికి సంబంధించి స్టేను ఎత్తివేయడానికి నిరాకరించింది. నిధుల విడుదలపై ఉన్న స్టేను తొలగించాలంటూ ప్రభుత్వం చేసిన అభ్యర్థనను తోసిపుచ్చిన న్యాయస్థానం, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా ఈ పథకాలకు సంబంధించి చెక్కులను ఎమ్మెల్యేలు ఇవ్వడాన్ని ప్రధానంగా తప్పుబట్టిన న్యాయస్థానం.. అది రాజకీయ జోక్యమే అవుతుందని హెచ్చరించింది.

# ఖర్గేతో మంత్రి కొండా సురేఖ భేటీ.. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలపై వివరణ

మొదటిపేజీ తరువాయి

మంత్రి కొండా సురేఖ ఆదివారం బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. ఇటీవల తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు, ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలపై ఖర్గేకు ఆమె వివరణ ఇచ్చినట్లు సమాచారం. సుమారు గంటకుపైగా ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల సుస్మితా పటేల్ చేసిన కొన్ని వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సురేఖను ఖర్గే ఆరా తీసినట్లు సమాచారం.

పార్టీకి నష్టం కలిగేలా మాట్లాడటం సరికాదని, నాయకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించినట్లు తెలుస్తోంది. పార్టీకి సంబంధించిన విషయాలను పార్టీ వేదికపైనే చెప్పుకోవాలని ఖర్గే స్పష్టం చేసినట్లు సమాచారం. తన కుమార్తె వ్యాఖ్యలపై ఇప్పటికే రెండుసార్లు వివరణ ఇచ్చానని సురేఖ ఖర్గేకు చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీని, గాంధీ కుటుంబాన్ని తాను విమర్శించలేదని వివరించినట్లు సమాచారం.

# విదేశాల్లో తలదాచుకున్న గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం - అమిత్ షా

మొదటిపేజీ తరువాయి

నిందితులు బంబీహా ముఠాతో సంబంధాలు కలిగిన జస్‌ప్రీత్ సింగ్, అజయ్ సింగ్, పవన్‌దీప్ సింగ్‌లుగా తెలిపారు. వీరిపై పలు తీవ్రమైన నేరాల ఆరోపణలు ఉన్నాయని షా పేర్కొన్నారు. బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కేసుల్లో నిందితులుగా ఉన్నారని వెల్లడించారు.

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 51 మంది కరడుగట్టిన నేరస్థులను విదేశాల నుంచి భారత్‌కు రప్పించినట్లు ఆయన తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో సురక్షిత, భద్రమైన భారత్ లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. పంజాబ్‌లోని లూథియానాలో జరిగిన గ్రనేడ్ దాడి కుట్రలోనూ వీరి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

# త్వరలోనే తెలంగాణ ప్రభుత్వ సొంత 'రైడ్-హెయిలింగ్' యాప్!

మొదటిపేజీ తరువాయి

దీనిద్వారా ప్రైవేట్ యాప్‌ల కమిషన్ల భారం తగ్గి డ్రైవర్ల నికర ఆదాయం పెరిగే అవకాశముందని చెప్పారు.

### ◆ 2012 తర్వాత తొలిసారిగా ఛార్జీల పెంపు

రవాణా రంగ కార్మికుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 2012 తర్వాత మొదటిసారిగా ఆటో ఛార్జీల సవరణకు ప్రభుత్వం నిర్ణయాత్మకంగా ఆమోదం తెలిపింది. కొత్త ఛార్జీలకు సంబంధించి త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

### ◆ ఈవీ కన్వర్షన్‌కు రూ.1.50 లక్షల సాయం

హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణతో పాటు ఇంధన భారాన్ని తగ్గించేందుకు డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు (రెట్రోఫిట్టింగ్) ఒక్కో వాహనానికి రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు స్పష్టం చేశారు.

### ◆ బైక్ ట్యాక్సీలు.. సంక్షేమంపై స్పష్టత

వాణిజ్య అవసరాలకు మాత్రమే ఉపయోగించే 'పసుపు రంగు నంబర్ ప్లేట్' ఉండే ద్విచక్రవాహనాలను మాత్రమే బైక్ ట్యాక్సీలుగా అనుమతించే అంశంపై త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే, ఎన్నికల హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000 ఆర్థిక సహాయం అందించే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి వివరించారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కూడా ప్రభుత్వం అంగీకరించింది.

# కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

- కొత్తవాడలో తొలి బ్యాచ్‌కు సర్టిఫికెట్ల పంపిణీ





**కరపత్రం ప్రతినిది వరంగల్, ఆగస్టు 24**

కొత్తవాడలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న తొలి బ్యాచ్ మహిళలకు సోమవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 3150 ప్రాజెక్ట్ చైర్మన్ బేతి అశోక్ బాబు, 23వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు కుట్టుశిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడి, ఆర్థికంగా స్వావలంబన సాధించే అవకాశం కలుగుతుందని అన్నారు. మహిళలు శిక్షణలో పొందిన నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు.

కుట్టుశిక్షణ కేంద్రం నిర్వాహకులు గజ్జెల కావ్య, ఆడెపు శిరీష, చిప్ప కావ్య మాట్లాడుతూ.. మహిళలకు శిక్షణ అందించి ఉపాధి కల్పించేలా కేంద్రాన్ని ఏర్పాటు చేసి సహకరిస్తున్న చిప్ప వెంకటేశ్వర్లు నేతకు, అలాగే రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 3150 సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటివరకు సుమారు 100 మంది మహిళలు కుట్టుశిక్షణ పూర్తి చేసుకుని ఉపాధి పొందుతున్నారని తెలిపారు.

# స్వర్గీయ శ్రీనివాసరావుకు నివాళు లర్పించిన ఎంపీ రవిచంద్ర

**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 24**





డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి,మాజీ ఎంపీ కే.ఆర్.సురేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,కొత్త ప్రభాకర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి తదితర ప్రముఖుల తో కలిసి

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వారి నివాసానికి చేరుకొని స్వర్గీయ జోగినిపల్లి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు బావమరిది, శోభమ్మ తమ్ముడు శ్రీనివాసరావు ఈనెల 13వతేదీన మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా ఆయన దశదిన కర్మకాండ సోమవారం కొంపెల్లిలోని ఆస్పిషియస్ కన్వెన్షన్ హాలులో జరిగింది.ఈ కార్యానికి ఎంపీలు రవిచంద్ర, పార్థసారథి రెడ్డి, మాజీ ఎంపీ సురేష్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరై స్వర్గీయ శ్రీనివాసరావు చిత్రపటానికి పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# హబ్సిగూడ డివిజన్ బీజేపీ ఎండోమెంట్ సెల్‌లో నూతన నియామకాలు



**కరపత్రం ప్రతినిది ఉప్పల్, ఆగస్టు 24**

భారతీయ జనతా పార్టీ హబ్సిగూడ డివిజన్ ఎండోమెంట్ సెల్ (ధార్మిక విభాగం)లో నూతన నియామకాలు చేపట్టారు. హబ్సిగూడ డివిజన్‌కు చెందిన టి. రాఘవేందర్ రెడ్డి, ఆర్. బుచ్చి రెడ్డి, విద్యాసాగర్ రెడ్డిలను సామాజిక వర్గాల ప్రతినిధులుగా నియమించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా కన్వీనర్ చంద్రమౌళి, కో–కన్వీనర్ వల్లి నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉప్పల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థల సహకారంతో హబ్సిగూడ డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు పనిచేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు నూతనంగా నియమితులైన నాయకులకు అభినందనలు తెలిపారు.

# జర్నలిస్టు నాయకుల సంతాపం

- రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ మాతృమూర్తి మృతి



**కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 23**

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే––ఐజేయూ)రాష్ట్ర అధ్యక్షుడు కె.విరహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున గజ్వేల్‌లోని తన నివాసంలో కన్నుమూశారు.విషయం తెలుసుకున్న యూనియన్ రాష్ట్ర నాయకులు పిన్నా శివకుమార్,టీయూడబ్ల్యూజే––ఐజేయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రామచందర్,ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్,సీనియర్ నాయకుడు నార్లగిరి యాదగిరి గజ్వేల్‌లోని విరహత్ అలీ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలిపారు.బాషారత్ ఉన్నిసా బేగం ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని వారు ప్రార్థించారు.

# సెప్టెంబర్ నాటికి వన మహోత్సవ లక్ష్యాలు పూర్తి చేయాలి

- రేపు జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కలు నాటాలి
- మొక్కల సంరక్షణ,మనుగడపై ప్రత్యేక దృష్టి మంత్రి కొండా సురేఖ





**కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 24**

వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,జిల్లా అటవీ అధికారి నిఖిత,చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ భీమ్ నాయక్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రస్తుత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా,ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు.రేపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించి,ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు.ఇటీవల కురుస్తున్న వర్షాలు,రానున్న రోజుల్లో అనుకూల వాతావరణం ఉండే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి సూచించారు.ప్రతి మండలం,గ్రామం,పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.అంగన్‌వాడీ టీచర్లు,స్వయం సహాయక సంఘాల మహిళలు,ఎన్ఎస్ఎస్,ఎన్‌సీసీ విద్యార్థులు,యువత,ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయాలని తెలిపారు.ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,మంత్రులు,ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు.మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి స్పష్టం చేశారు.ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని,వాటి మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని ఆదేశించారు.ఎక్కడైనా మొక్కలు చనిపోతే వెంటనే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు.నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని,అవసరమైన మొక్కలను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని,పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు.దేవాలయాలు,పాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాలు,ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు.బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని,వన మహోత్సవానికి విస్తృత ప్రచారం కల్పిస్తూ మీడియాను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులతో సమీక్షించారు.జిల్లాలో అన్ని వర్గాల ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి,నిర్దేశించిన వన మహోత్సవ లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా,వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ చేపడతామని తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)వై.వి.గణేష్,డీఆర్‌డీవో నాగపద్మజ,వరంగల్ ఆర్డీవో సుమ,ట్రైనీ కలెక్టర్,డీఈఓ రంగయ్యనాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల ను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**కరపత్రం ప్రతినిది వరంగల్, ఆగస్టు 24**

ప్రజావాణిలో అందే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి,అత్యంత ప్రాధాన్యతతో త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 145 దరఖాస్తులు అందగా..రెవెన్యూ శాఖకు 42, జీడబ్ల్యూఎంసీకి 26, హౌసింగ్ శాఖకు 14,డీఆర్డీవోకు 14,ఇతర శాఖలకు సంబంధించి 49 దరఖాస్తులు వచ్చాయి. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసిన కలెక్టర్..ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి,ప్రజలకు త్వరితగతిన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రెవెన్యూ,హౌసింగ్,జీడబ్ల్యూఎంసీ,డీఆర్డీవో పరిధిలోని సమస్యలకు సంబంధించిన వినతులు అధికంగా వచ్చాయని తెలిపారు.ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.నిరుద్యోగ సమస్యకు సంబంధించిన వినతులను పరిశీలించిన ఆమె..కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో టైలరింగ్‌లో నైపుణ్యం ఉన్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం మండలాల పరిధిలోనూ ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహిస్తోందని కలెక్టర్ తెలిపారు.పెన్షన్ తదితర సమస్యలపై ప్రజలు మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)జి.సంధ్యారాణి,అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)వై.వి.గణేష్,జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి,డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలపై వినతిపత్రాలను

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.12 లక్షల విలువైన బంగారం,వెండి,నగదు,సెల్‌ఫోన్లు స్వాధీనం
- మిల్స్ కాలనీ,సీసీఎస్ పోలీసుల సంయుక్త ఆపరేషన్






**కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 24**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను మిల్స్ కాలనీ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు.నిందితుడి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 70.19 గ్రాముల బంగారు ఆభరణాలు,527.9 గ్రాముల వెండి,రూ.29,875 నగదు,రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం..మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన వరుస చోరీలపై కేసులు నమోదయ్యాయి.వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టారు.గతంలో జరిగిన చోరీలను విశ్లేషించిన పోలీసులు సోమవారం ఉదయం ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి.ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్ల(27)అనే నిందితుడు పెద్దపల్లి జిల్లాకు చెందినవాడని,ప్రస్తుతం మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.నిందితుడు పగటిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి,రాత్రి వేళల్లో అక్కడ చోరీలకు పాల్పడేవాడని పోలీసులు తెలిపారు.2024,2025 సంవత్సరాల్లో మహారాష్ట్రలో నాలుగు చోరీలకు పాల్పడిన అతడిని అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. అనంతరం బెయిల్‌పై విడుదలైనప్పటికీ నేరప్రవృత్తిని మార్చుకోకుండా మళ్లీ చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది.ఈ ఏడాది మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివనగర్,ఎస్.ఆర్.ఆర్.నగర్ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడిని వరంగల్ రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేసి,అతడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ,మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ స్వామి,ఎస్ఐ మహేష్,ఏఏఓ సల్మాన్ పాషా,సీసీఎస్,మిల్స్ కాలనీ సిబ్బందిని సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత అభినందించారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు అనుమతులు ఇవ్వాలి

- హనుమకొండ కలెక్టర్‌కు మైనార్టీ ఉద్యమకారుల వినతి







**కరపత్రం ప్రతినిది హనుమకొండ,ఆగస్టు 24**

తెలంగాణ ఉద్యమకారుడు,నర్సంపేట మాజీ ఎమ్మెల్యే,రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్‌గా సేవలందించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని హనుమకొండలోని అలంకార్ సెంటర్‌లో ప్రతిష్ఠించేందుకు అనుమతులు ఇవ్వాలని మైనార్టీ ఉద్యమకారులు కోరారు.ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో సంబంధిత అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ..సాధారణ రైతు కుటుంబం నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి తనదైన శైలిలో ప్రజాసేవ కొనసాగించారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన అత్యంత క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.ఇటీవల అనారోగ్యానికి గురైన సమయంలో ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుందని గుర్తు చేశారు.అనంతరం ఆయన మృతి చెందగా ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిందన్నారు.ప్రజా సేవలో విశేష కృషి చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను భావితరాలకు పరిచయం చేసేందుకు అలంకార్ సెంటర్‌లో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించినట్లు తెలిపారు.విగ్రహ ఏర్పాటుకు సంబంధిత శాఖల ద్వారా అవసరమైన అన్ని అనుమతులు మంజూరు చేయాలని కోరారు.కార్యక్రమంలో ఉద్యమ నాయకులు నాయిమొద్దీన్,కమరున్నీసా,షేక్ అబ్దుల్ నబీ,మాజీద్ తదితరులు పాల్గొన్నారు.